వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన త్రివేణి సంగం
- నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు


రాంలీలా మైదానంలో చలువ పందిళ్ల ఏర్పాటు


రాంలీలా మైదానంలో కిక్కిరిసిన జనం(ఫైల్)

లంగర్‌హౌస్: శ్రీరామ నవమి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు లంగర్‌హౌస్‌లోని త్రివేణి సంగమం ముస్తాబయ్యింది. నేడు విశ్వావసు తెలుగు నూతన సంవత్సర ప్రారంభం ఉగాది పర్వదినాన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. బ్రహ్మోతవాల్లో భాగంగా పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో కొలువుదీరిన స్వామి వారిని వేదపండితుల సమక్షంలో ప్రతిరోజూ లంగర్‌హౌస్‌పుర వీధుల్లో వైభవంగా ఊరేగించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని రాహుల్‌దాస్ బాబా తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాలు..

జానకీ దేవి, విజయ రాఘవ స్వామి వార్లకు నిర్వహించే వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ఉదయం 6 గంటలకు మూల విరాట్‌లకు ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. విశ్వక్‌సేనుని పూజ, పంచాగ శ్రవణం ఉంటాయి. ఏప్రిల్ 1న మంగళవారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం అనంతరం నారయణి రూపంలో కొలువుదీరిన శ్రీనివాసుడిని గరుడ వాహనంపై ఊరేగిస్తారు. బుధవారం లక్ష్మీనరసింహస్వాముల కల్యాణం, అనంతరం ఆరు అడుగుల ఎత్తైన భారీ హనుమాన్ వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. 5న సీతారాములకు సాయిటెక్ ముత్యాల శేఖర్ బాబు, అత్తాపూర్ గణేష్ నివాసాల్లో మంగళ స్నానాలు నిర్వహిస్తారు. అనంతరం సంగం ఆలయంలో వసంతోత్సవం సీతారాములను పెళ్లి కుమారుడు, పెళ్లి కూతుర్లుగా ముస్తాబు, తలంబ్రాలు కలపడం నిర్వహించనున్నారు.

మీసాల రాముడి పెళ్లి వేడుక..

6న జానకీ దేవి, శ్రీరాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. రాంలీలా మైదానంలో పందిళ్లు, భారీ వేదికపై అయోధ్యతో పాటు దేశంలోని వివిధ ప్రముఖ క్షేత్రాల నుంచి తరలివచ్చే సాధుసంతులు, పీఠాధిపతులు, వేదపండితుల సమక్షంలో ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం ప్రారంభించనున్నారు. అంతకు ముందు సాయిటెక్ శేఖర్ బాబు, అత్తాపూర్ గణేష్ నివాసాల వద్ద నుంచి సీతారాములను ఊరేగింపుగా రాంలీలా మైదానానికి తీసుకురానున్నారు. 7న శ్రీ రామ చంద్రులకు పట్టాభిషేకం, రాజతిలకం, చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం..

పవిత్ర పుణ్య క్షేత్రం సంగం మఠంలో వైష్ణో సంప్రదాయం ప్రకారం ప్రతి సంవత్సరం నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ఎలాంటి టికెట్లు, వీఐపీ టికెట్లు కూడా లేకుండా అందరిని సరిసమానంగా చూస్తూ ఏర్పాట్లు చేస్తాం. కల్యాణ కంకణ దారణ అందరికీ చేయించి భక్తులందరూ ప్రత్యక్ష కల్యాణంలో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశాం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తరించగలరు.

– 1008 రాహుల్‌దాస్ బాబా, పీఠాధిపతి

ఉగాది, రంజాన్ సంబరాలు

విజయనగర్‌కాలనీ: నారాయణ ఈటెక్నో స్కూల్ విజయనగర్ కాలనీ బ్రాంచ్‌లో శనివారం ఉగాది, రంజాన్ పండగలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉగాది పచ్చడిని, షీర్ కూర్మా, వివిధ రకాల స్వీట్లు, ఆహార పదార్థాలను ఒకరికొకరు ఇచ్చుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యావేత్తలు జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డిలో పాటు ప్రిన్సిపాల్ గంగాకిరణ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


విజయనగర్‌కాలనీ నారాయణ స్కూల్‌లో వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

రంజాన్ షాపింగ్ సందడి


చార్మినార్ రంజాన్ మార్కెట్‌లో కిటకిటలాడుతున్న వినియోగదారులు

చార్మినార్: జుమ్మాతుల్ విదా ముగియడంతో ఇక ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పండగ కోసం ముస్లింలు అంతా సిద్ధమవుతున్నారు. శనివారం అమావాస్య కావడంతో ఆదివారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపిస్తే ఈనెల 31న, అంటే సోమవారం ఈద్-ఉల్-ఫితర్ నిర్వహించనున్నారు. ఒకవేళ 31న ఆకాశంలో నెలవంక కనిపిస్తే ఏప్రిల్ 1న అంటే.. మంగళవారం పండగ నిర్వహించనున్నారు. పండగను దృష్టిలో ఉంచుకొని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని పాతబస్తీ మీరాలం ఈద్గాలో ముస్లింలంతా సామూహిక ప్రార్థనలు చేయనున్నారు. ఇందుకోసం సంబంధిత అధికారులు ఇప్పటికే తగిన ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన మేరకు ఈద్గా మైదానంలో షామియానాలతో పాటు కార్పెట్లు జానీమాజ్‌లు ఏర్పాటు చేయనున్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఇప్పటికే ఈద్గా మైదానంలో పారిశుద్ధ్య కార్మికులతో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు.

ఇసుక వేస్తే రాలనంత జనం..

రంజాన్‌ను ఘనంగా నిర్వహించుకునేందుకు ముస్లింలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందుకోసం నిత్యావసర వస్తువులతో పాటు దుస్తులు, చెప్పులు, గాజులు, అత్తరులు.. ఇలా అవసరమైన వస్తువులను ఖరీదు చేయడంలో నిమగ్నమయ్యారు. దీంతో రంజాన్ మార్కెట్ జనంతో కిటకిటలాడుతోంది. చార్మినార్ మక్కా మసీద్ లార్డ్ బజార్ గుల్జార్‌హౌజ్ పత్థర్‌గట్టి మీరాలమండి మదీనా తదితర ప్రాంతాలన్నీ జనం రద్దీతో కళకళలాడుతున్నాయి. రంజాన్ మార్కెట్లో వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించడంతో జనం రద్దీ పెరిగింది. ఇసుక వేస్తే రాలనంత జనం చార్మినార్ పరిసరాల్లో కనిపిస్తోంది.

నేటి నుంచి ఉగాది నవరాత్రి ఉత్సవాలు

జియాగూడ: ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు జియాగూడ మహంకాళి ఆలయంలో ఉగాది నవరాత్రి, అమ్మవారి వార్షికోత్సవ శ్రీరామ నవమి కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గౌడుగు ఆంజనేయులు ముదిరాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారపు. 30న అమ్మవారికి నిత్యాపూజలు అందులో భాగంగా ప్రతిరోజూ మాతేశ్వరీకి అభిషేకం, అలంకరణ, నిత్య హోమం, అఖండ హారతి, తీర్థ ప్రసాద వితరణలు ఉంటాయి. 31న నిత్య పూజలు, మధ్యాహ్నం హారతి అన్న ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. 6న ఉదయం 10:55 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి


పౌర సరఫరాల శాఖ అధికారికి దరఖాస్తులను అందజేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: అర్హులందరికీ రేషన్‌కార్డులు తప్పకుండా ఇవ్వాలని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ డిమాండ్ చేశారు. అప్లికేషన్లను పౌర సరఫరా శాఖ అధికారి పుష్పలతకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అన్ని ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు కీలకమైన నేపథ్యంలో అర్హులైన అందరికీ రేషన్‌కార్డులు ప్రభుత్వం ఇవ్వాలని ఆయన కోరారు. రేషన్‌కార్డు లేదంటూ పేదలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రభుత్వం దీన్ని దృష్టిలో ఉంచుకొని రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని ఆయన విన్నవించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


పేదలకు సరుకులు పంపిణీ చేస్తున్న వెంకటేశ్, మల్లికార్జునరావు

గౌలిపురా: ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నప్పుడే నిజమైన ఆనందం లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. ఉగాది పండగ సందర్భంగా లాల్‌దర్వాజా నాగులచింతలోని మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సంస్థ కార్యాలయంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై 50 మంది నిరుపేద కుటుంబాలకు పండగకు కావాల్సిన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మదర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంకెనపల్లి మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి ఎ.రాఘవ, నిర్వాహకులు అరుణా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే


పట్టాలు పొందిన విద్యార్థులు

గోల్కొండ: మెహిదీపట్నంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. యూకేజీ నుంచి ఒకటవ తరగతికి, ఐదో తరగతి నుంచి ఆరో తరగతికి వెళుతున్న విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య పాఠశాల మెహిదీపట్నం జోన్ ఏజీఎం బి.కృష్ణ మాట్లాడుతూ..భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు ఆట, పాట, మాటల్లో తర్ఫీదు ఇవ్వాలనే గ్రాడ్యుయేషన్ డే చేపట్టామని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏజీఎం బి.కృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.స్వాతి చేతులమీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో శ్రీ చైతన్య పాఠశాల ఆర్ఐ హరికృష్ణ, డీన్ మల్లేశ్‌యాదవ్, ఇన్‌చార్జులు నదీమ్, బాలరాజు, రవి, షగుఫ్త, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురా స్లాటర్ హౌస్‌ను సందర్శించిన అధికారులు



గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని స్లాటర్ హౌస్ (కమేళా)ను శనివారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ పంకజం, రామ్‌కీ ప్రాజెక్టు, సీఈ ప్రాజెక్టు అధికారులు సందర్శించారు. స్లాటర్ హౌస్ ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. ప్రారంభానికి కావాల్సిన చర్యల నివేదికను రూపొందించి కమిషనర్‌కు అందజేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అతి త్వరలో గౌలిపురా స్లాటర్ హౌస్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా గౌలిపురా స్లాటర్ హౌస్ వివిధ కారణాలతో ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, ఆరె కటిక సంఘం ప్రతినిధులు మేయర్, కమిషనర్‌తో పాటు వివిధ స్థాయిల్లో అధికారులకు వినతిపత్రాలను అందజేయడంతో శనివారం సంబంధిత అధికారులు స్లాటర్ హౌస్‌ను సందర్శించారు.

బీఎస్పీ గోషామహల్ ఉపాధ్యక్షుడిగా ఠాకూర్ విక్రమ్ సింగ్


నియామక పత్రాన్ని అందుకుంటున్న ఠాకూర్ విక్రమ్ సింగ్

నాంపల్లి: బీఎస్పీ గోషామహల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా ఠాకూర్ విక్రమ్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బీఎస్పీ కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి అల్లోల రమేష్, జిల్లా అధ్యక్షుడు పి.వై.గిరి మహరాజ్, ప్రధాన కార్యదర్శి ఆధారి రాజేష్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా విక్రమ్ సింగ్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో పార్టీని బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జీసీ. శేఖర్, నేతలు రాకేష్, అరుణ్‌కుమార్, రాజ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

'జై బాపు-జై భీమ్'ను విజయవంతం చేయండి


సమావేశంలో ఏఐసీసీ కో ఆర్డినేటర్ నిర్మల్ కుమార్ యాదవ్ కైలాష్‌కుమార్ తదితరులు

అబిడ్స్: జై బాపు-జై భీమ్‌ను విజయవంతం చేయాలని ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన సమావేశాన్ని గాంధీభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..గోషామహల్‌లోని అన్ని మురికివాడలు, అన్ని ప్రాంతాల్లో పర్యటించి జైబాపు-జై భీమ్ నినాదాని విజయవంతం చేస్తామన్నారు. దళితులు, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ అండగా ఉన్నారన్నారు. రాహుల్‌గాంధీ పిలుపుమేరకు ప్రతి బస్తీ, ప్రతి మురికివాడలో ప్రతిరోజూ పర్యటించి పేద బడుగు వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉండే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: హనుమాన్‌నగర్ వద్ద తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులను శనివారం కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి పరిశీలించారు. హనుమాన్‌నగర్ వద్ద తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో అంబికానగర్, హనుమాన్‌నగర్ ఫేజ్-1, 2, 3, పటేల్‌నగర్, సరస్వతీనగర్, అచ్చయ్యనగర్ బస్తీవాసులకు తాగునీటి సమస్యలు నెలకొనడంతో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి జలమండలి సీజీఎం, జలమండలి జీఎం-2బీ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. దీంతో శనివారం హనుమాన్‌నగర్ వద్ద తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. తిరిగి బస్తీల ప్రజలకు యధావిధిగా నీటి సరఫరా జరుగుతుందని కార్పొరేటర్ సూచించారు. గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు ఇ.సుమన్ కుమార్‌ముదిరాజ్, నాయకులు జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, కాడి సురేందర్, జలమండలి అధికారులు డబ్ల్యూ. రవి పాల్గొన్నారు.

31 లోపల ఆస్తిపన్ను చెల్లించే వారికే ప్రత్యేక రిబెట్


రూ.10.62 కోట్ల చెక్కును అందుకున్న దుబ్బాక లావణ్య, శైలజ, కైలాష్ సింగ్

అబిడ్స్: మార్చి 31వ తేదీ లోపు ఆస్తిపన్ను పాత బకాయిలు చెల్లించే వారికే ప్రత్యేక రిబెట్ ఉంటుందని జీహెచ్‌ఎంసీ-14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య పేర్కొన్నారు. సోమవారం రాత్రి వరకు ఎవరైనా పాత బకాయిలు చెల్లిస్తే వారి అపరాద రుసుములో 90 శాతం ప్రత్యేక రిబెట్ ఇస్తున్నామని ఆమె వివరించారు. శనివారం హౌసింగ్‌బోర్డు డిపార్ట్‌మెంట్‌కు చెందిన రూ.10.62 కోట్ల ఆస్తిపన్ను చెక్కును ఏఎంసీ శైలజ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ కైలాష్ సింగ్‌తో కలిసి అందుకున్నారు. అనంతరం దుబ్బాక లావణ్య మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ సోమవారం లోపు ఆస్తిపన్ను చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు సంజీవ్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ పతనం ఖాయం


ఉమామహేందర్, అమర్‌సింగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాదని ప్రజలు విమర్శిస్తున్నారని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమామహేందర్ అన్నారు. శనివారం గోల్కొండ బంజారి దర్వాజా వద్ద బీజేపీ టోలిచౌకీ డివిజన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి ఉమామహేందర్‌తో పాటు బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్‌ను సన్మానించారు. ఉమామహేందర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలుపుకోలేకపోతున్నారన్నారు. పేద ప్రజల ఉసురుతో తెలంగాణలో కాంగ్రెస్ పతనం ఖాయమన్నారు. తెలంగాణలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కారే అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అభిమానం తగ్గుతుందని అన్న విషయం ఇటీవలే ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ టోలిచౌకీ డివిజన్ ఇన్‌చార్జి రామకృష్ణ, నర్సింహ తదితరులున్నారు.

గాయని వేమూరి మంజులకు డాక్టరేట్


డాక్టరేట్‌ను అందుకుంటున్న గాయని వేమూరి మంజుల

నాంపల్లి: ప్రముఖ సినీ, లలిత సంగీత గాయని వేమూరి మంజులకు తమిళనాడులోని హోసూర్‌కు చెందిన ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సంగీత రంగంలో ఆమె చేసిన కృషికి, సేవలకు గాను డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ..తాను చేసిన సేవా కార్యక్రమాలకు గతంలో ఉజ్వల, నంది ఉగాది పురస్కారంతో పాటు పలు అవార్డులు వచ్చాయని గుర్తుచేశారు. తాజాగా గౌరవ డాక్టరేట్ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మంజుల డాక్టరేట్ పొందిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

ఉగాది బాల పురస్కారాల ప్రదానం


కళాకారులతో ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి పురస్కారాలను ఇవ్వడం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీసాయి అలేఖ్య సంస్థ ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకొని విశేషంగా రాణిస్తున్న పలువురు విద్యార్థులకు ఉగాది బాల పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను పాఠశాల స్థాయిలోనే గుర్తించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం పలువురు నాట్య గురువులను, కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి, శ్రీసాయి అలేఖ్య వ్యవస్థాపకురాలు ఉపద్రష్ట అరుణ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశాం


ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: ఈద్గాలు, రంజాన్ ప్రార్థనలు జరిగే కమ్యూనిటీ హాల్స్, ప్లే గ్రౌండ్‌లను ప్రార్థనల కోసం సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన హకీంపేట్, సెవన్ టూంబ్స్, సావైసీ ప్లే గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఈద్గాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రార్థనలకు వచ్చే వారి కోసం తాగునీటి సౌకర్యంతో పాటు కాలకృత్యాలు తీర్చుకోవడానికి నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా ప్రార్థనలకు వచ్చే వారి కోసం ఈద్గా గ్రౌండ్‌లను చదును చేస్తున్నామన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, పాషాభాయ్, అలీఖాన్, ఏకే పఠాన్, అమీన్ పాషా తదితరులున్నారు.

పండగలకు ప్రత్యేక నీటి సరఫరా చేయాలి


వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎడ్ల పండరీనాథ్

చాంద్రాయణగుట్ట: రాబోయే శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి వేడుకలకు చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద నీటి సరఫరాతో పాటు వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు సరఫరా చేయాలని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ కోరారు. ఈ మేరకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు. దశాబ్దాల క్రితం వేసిన పైప్‌లైన్లనే ఇప్పటికీ కొనసాగిస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మాదరి చంద్ర శేఖర్, నాయకులు సురేష్ కుమార్, దేవేందర్, శ్రీధర్ తదితరులున్నారు.